క్లుప్తంగా

వయోవృద్ధులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

చీరాల అర్బన్: రాష్ట్రంలో వయోవృద్ధుల సంక్షేమానికి కేరళ రాష్ట్రంలో మాదిరిగా ప్రత్యేక కమిషన్, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగవీరభద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వృద్ధులపై దాడులు, నిర్లక్ష్యంగా కుటుంబ సభ్యులు వ్యవహరించడం ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాటిని నియంత్రణ చేయడానికి 2007 తల్లిదండ్రుల వృద్ధుల సంరక్షణ చట్టం సమర్థవంతంగా అమలు పరచాలని కోరారు. కరోనా సమయంలో కేంద్రం రద్దు చేసిన రైల్వే రాయితీ తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. 2007 చట్టం ప్రకారం వృద్ధుల పోషణ, సంరక్షణ కోసం డివిజనల్ స్థాయిలో ఏర్పాటు చేసిన మెయిన్‌టెన్స్ ట్రిబ్యునల్ తీర్పులు నియమిత కాలంలో పరిష్కరించాలన్నారు. వృద్ధుల ఆస్తి, ప్రాణరక్షణ, వేధింపులు, హత్యలు మొదలగు సంఘటనలు జరగకుండా పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వయోధికులైన తల్లిదండ్రుల బాధ్యతలను విస్మరించే కుమారుడు, కుమార్తెలకు కన్నవారి ఆస్తులు అనుభవించే హక్కు లేదని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సంతోషదాయకమన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు

● వ్యక్తికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడు శ్రీనివాసరావు

అద్దంకి: బైక్‌ను కారు ఢీ కొట్టిన ఘటన అద్దంకి-దర్శి రహదారిలోని వీఎస్ఆర్ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం జరిగింది. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన అడుసుమల్లి శ్రీనివాసరావు పెట్రోలు బంకువద్ద పెట్రోలు కొట్టించుకుని బయటకు వస్తున్నాడు. ఈ సమయంలో తిమ్మాయపాలెం వైపు నుంచి వస్తున్న ఏలూరు నుంచి దర్శివైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. అడుసుమల్లి శ్రీనివాసరావుకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆశలు మెండుగా.. గాదెలు నిండగా!



కారంచేడు-చీరాల రోడ్డులో వరినాట్లు వేసుకుంటున్న వ్యవసాయ కూలీలు



కారంచేడు-కుంకలమర్రు రోడ్డులో ఎద పద్ధతిలో సాగు చేసిన వరిచేను

● అనుకూలించిన వాతావరణం
● సాగుకు సిద్ధమైన అన్నదాతలు

కారంచేడు: ప్రతి ఏటా వచ్చే లాభ నష్టాలను చూసి అన్నదాత ఏనాడూ చలించడు. అతని మార్గం.. పదిమందికీ అన్నం పెట్టడమే. ప్రభుత్వాలు సాయం చేయకున్నా.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా మట్టి వాసన వదిలి ఏనాడూ పారిపోడు. ఈ ఏడాది వరి సాగుకు వాతావరణం అనుకూలించడంతో సన్నాహాలు ప్రారంభించారు. బాపట్ల జిల్లాలో కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద సుమారు లక్ష ఎకరాల్లో అన్నదాతలు ప్రతి ఏటా వరి సాగు చేపడుతుంటారు. ఈ ఏడాది కూడా వరి సాగుకు ఈ ప్రాంతంలో అనుకూలంగా ఉండే 2270, 92 రకాల వరి వంగడాలు సాగు చేస్తున్నారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద చీరాల, కారంచేడు, పర్చూరు, చినగంజాం, వేటపాలెం, నాగులుప్పలపాడు వంటి మండలాల పరిధిలోని గ్రామాల్లో వరి సాగుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. వరి నాట్లు కొంత మంది వేసుకుంటుండగా, మరి కొంత మంది ఎద పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు.

యూరియాతో తప్పని తిప్పలు..

ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేనివిధంగా యూరియా కోసం అన్నదాతలు రోడ్డు ఎక్కారు. గతంలో ఎంత మంది కౌలు రైతులకు ఎంత కావాలన్నా యూరియా అందుబాటులో ఉండేది. కానీ ఈ ఏడాది ఒక్కో కౌలు రైతుకు కేవలం రెండు బస్తాల చొప్పున మాత్రమే యూరియా అందుబాటులో ఉంచడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తం అయింది. దీంతో దొరకదేమో అని అన్నదాతలు రోడ్డు ఎక్కారు.

వ్యవసాయ కూలీలకు పనులేవీ?

గతంలో రైతులు వరి సాగుకు ముందుగా దమ్ములు, విత్తన శుద్ధి, నారుమళ్ళు పోసుకోవడం, నాట్లు వేసుకోవడం వంటి పనులను వ్యవసాయ కూలీల సాయంతో చేసుకొనే వారు. ప్రస్తుతం రైతులు ఎక్కువ శాతం ఎద పద్ధతుల్లో వరి సాగు చేస్తున్నారు. దీంతో వ్యవసాయ కూలీలకు పెద్దగా పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ ప్రాంతలో ప్రతి రోజూ వెయ్యి నుంచి రెండు వేల మంది వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం వచ్చేవారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న వ్యవసాయ కూలీలకే పనుల లేక అవస్థలు పడాల్సిన పరిస్థితులున్నాయని రైతు కూలీలు వాపోతున్నారు.

ఇబ్బంది పెట్టాలనుకోవడం అవివేకం



బ్రహ్మానందరెడ్డిని పరామర్శిస్తున్న జెడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మి తదితర నాయకులు

చినగంజాం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించి ఇబ్బంది పెట్టాలని చూడటం కూటమి పార్టీల అవివేకమైన చర్య అని ఇంకొల్లు జెడ్పీటీసీ సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి అన్నారు. పర్చూరు నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానంద రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడంతో ఆయనను పరామర్శించేందుకు చినగంజాంలోని ఆయన స్వగృహానికి మంగళవారం వెళ్లారు. రాజకీయ కక్షలు ఉంటే ప్రజా క్షేత్రంలో తేల్చుకోవాలే కాని వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. అధికారులను అడ్డం పెట్టుకొని పబ్బం గడుపుదామనుకోవడం కూటమి ప్రభుత్వానికి, నాయకులకు సమంజసం కాదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టీడీపీ శ్రేణులు పలు మార్లు ఆయన దిష్టిబొమ్మను తగులబెట్టిన సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. అదే విధంగా నియోజక వర్గ పరిధిలో పర్చూరు బొమ్మల సెంటర్‌లో దిష్టిబొమ్మను తగుల బెట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని అటువంటి చర్యలకు పాల్పడిన టీడీపీ శ్రేణులపై అక్రమంగా, అన్యాయంగా కేసులు బనాయించి ఇబ్బంది పెట్టలేదని వారి విజ్ఞతకే వదలిపెట్టారన్నారు. ప్రజా దేవాలయం వంటి శాసనసభలో హిందూపురం శాసన సభ్యుడు బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసన తెలియజేసిన కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయడం, నిర్బంధం పెట్టడం, పోలీస్ అధికారులు సంబంధలేని సెక్షన్‌లు బనాయించి కోర్టుకు హాజరు పరచడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ధైర్యంగా పోటీకి నిలబడి గెలిచి సత్తా చూపించుకోవాలే కాని దొడ్డిదారిన అక్రమ కేసులు బనాయించి ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని హెచ్చరించారు. నాయకుడంటే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలే కానీ.. దొంగచాటు రాజకీయాలు నడపడం కాదని ఇటువంటి నాయకులు ప్రజా సేవచేసేందుకు అనర్హులని, కూటమి పార్టీ చేస్తున్న అక్రమాలను, అన్యాయాలను ప్రజలు చూస్తూ ఊరుకోరని తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి భవనం శ్రీనివాసరెడ్డి, కొత్తపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు కోట సుబ్బరామిరెడ్డి, సూరిన శ్రీనివాసరెడ్డి, అక్కల రవి, కుక్కల వెంకటేశ్వర్లు, ఆసోది శ్రీనివాసరెడ్డి, అక్కల సుబ్బారెడ్డి, ఈశ్వరరెడ్డి, సూరిన సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండప నిర్మాణం ప్రతిష్టాత్మకం

● వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి



నూతలపాడు కల్యాణ మండపంలో మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

పర్చూరు(చినగంజాం): నూతలపాడులో గ్రామస్తుల కృషి, పట్టుదల, సహాయ సహకారాలతో టీటీడీ కల్యాణ మండప నిర్మాణం చేయడం అత్యంత ప్రతిష్టాత్మకమని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజక వర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో బుధవారం ప్రారంభోత్సవం చేయనున్న కల్యాణ మండపాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సుమారు రూ. 3.5 కోట్ల పైగా వ్యయంతో నూతలపాడులోని ప్రజలు, దాతలు, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తి చేశారన్నారు. రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేశారని, గ్రామస్తులు రూ. 50 లక్షలతో స్థలాన్ని కొనుగోలు చేసి టీటీడీ వారికి అందించడంతో నిర్మాణం చేపట్టారన్నారు. మరో 2 ఎకరాల్లో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారని తెలిపారు. నూతలపాడు చుట్టు పక్కల 10 గ్రామాల్లో కల్యాణ మండపం వసతి లేని విషయాన్ని దృష్టిలో ఉంచుకొని భవనం రాజగోపాలరెడ్డి, యర్రం లక్ష్మారెడ్డి, పోలూరి శివారెడ్డి, బాపిరెడ్డి, పోలూరి వెంకటరెడ్డి, వణకూరి ప్రభాకరరెడ్డితో మొత్తం 20 మంది కమిటీ సభ్యులుగా ఏర్పాటై నిర్మాణానికి పూనుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2023లో టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, అప్పటి డిప్యూటీ సీఎం, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణలు శంకు స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారని గుర్తుచేశారు. రూ. 2 కోట్ల టీటీడీ ఆర్థిక సాయంతో పాటు సుమారు 200 మంది దాతల ఆర్థిక సాయం రూ 1.5 కోట్లతో నిర్మాణాన్ని పూర్తి చేశారని తెలిపారు. కల్యాణ మండపాన్ని ప్రతిష్టాత్మక నిర్మాణంగా గుర్తించిన దాతలు రూ. 10 లక్షలకు పైగా ఆర్థిక సాయాన్ని అందించడంతో పాటు అదనంగా మరింత సాయమందించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. నూతలపాడులో కాలేజీ నిర్మాణం, మార్కెట్ యార్డు నిర్మాణాలతో పాటు ప్రస్తుతం కల్యాణ మండపం నిర్మాణంలో ప్రారంభం నుంచి తాను చేయూత ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామని, సాంకేతిక నిపుణులు, కాంట్రాక్టర్, బేల్దారీలకు అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

డిజిటల్ బుక్ ఆవిష్కరణ



డిజిటల్ బుక్ ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్, నాయకులు

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని వైఎస్సార్ సీపీ కర్యాలయంలో మంగళవారం డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని పార్టీ మండల కన్వీనర్ వూట్ల నాగేశ్వరరావు, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నాయకుడు తమకు అన్యాయం జరిగితే వివరాలను డిజిట్ బుక్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలసీదారులకు మెరుగైన సేవలు

అద్దంకి రూరల్: ఎల్ఐసీ, ఆర్‌బీఎల్‌తో వ్యాపార అనుబంధం చేసుకుందని ఎల్ఐసీలో ఉన్న అన్ని పాలసీలు ఆర్‌బీఎల్ బ్యాంకు ద్వారా అమ్మకాలు జరుపుకోవచ్చని అద్దంకి ఎల్ఐసీ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ మాధవ్‌కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఒప్పందం వలన పాలసీదారులు మెరుగైన సేవలు పొందవచ్చన్నారు. పాలసీదారులు ఆర్‌బీఎల్ సేవలు వినియోగించుకోవాలని తెలియపరిచారు.

మెడికల్ కళాశాల పోరుకు తరలిన నేతలు



అద్దంకి నుంచి తరలిన నేతలు

అద్దంకి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు, సమన్వకర్త అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ సెల్ నేతలు బాపట్ల తరలివెళ్లారు. జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జగ విజయ్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శులు, విప్పర్ల వెంకటేశ్వర్లు, శేఖర్, అద్దంకి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్కెనబోయిన రవి, జె. పంగులూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహేశ్, యువజన విభాగం అధ్యక్షుడు బొనిగలమధు, కొరిశపాడు యుజవన విభాగం అధ్యక్షుడు అశోక్‌తో పాటు 40 మంది తరలి వెళ్లారు.

హనుమంతరావు చిరస్మరణీయుడు



హనుమంతరావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీలక్ష్మి

ఇంకొల్లు(చినగంజాం): నిస్వార్థ ప్రజా సేవకుడుగా ప్రజల్లో గుర్తింపు పొందిన మద్దినేని హనుమంతరావు చిరస్మరణీయుడని.. ఆయన మరణం తీరని లోటని ఇంకొల్లు జెడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మి అన్నారు. ఇంకొల్లు రోటరీ గంగ కమ్యూనిటీ హాలులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మద్దినేని హనుమంతరావు సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. మాజీ శాసన సభ్యుడు బాచిన చెంచుగరటయ్య, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఆయన చేసిన సేవలను వక్తలు గుర్తు చేసుకున్నారు. ఇంకొల్లు మాజీ ఎంపీపీపీ, మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాస రెడ్డి, వీరగంధం ఆంజనేయులు, బలగం కోటేశ్వర రావు, అలవల రాఘవరెడ్డి, రోటరీ ప్రముఖులు, మద్దినేని హనుమంతరావు కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, హనుమంతరావు పాల్గొన్నారు.



కారంచేడు వైష్ణవీ దుర్గాలయంలో దుర్గాదేవిగా అమ్మవారి అలంకరణ



చీరాల: ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు



వేటపాలెంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఘనంగా దసరా శరన్నవరాత్రులు



చీరాల: సంతబజారులో కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూలంగి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బల్లికురవ: దసరా శరన్నవరాత్రులు మండలంలో వాడవాడలా నిర్వహిస్తున్నారు. అమ్మవార్లను దుర్గాదేవిగా ప్రత్యేకంగ అలంకరించి పూజలు నిర్వహించారు. రాత్రిళ్లు భజనలు చేపట్టారు.

యద్దనపూడి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దుర్గమాసురుడు అనే రాక్షసుడిని సంహరించింది అష్టమి రోజునే కనుక దుర్గాష్టమి రోజున అమ్మవారిని దర్శించుకుంటారు. పూనూరు త్రిపుర సుందరి సమేత త్రిపురాంతక స్వామి, నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారు, గన్నవరంలోని కాశి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, జాగర్లమూడి లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి అమ్మవారికి శ్రీ చక్ర పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

కారంచేడు: కారంచేడు వైష్ణవీదుర్గాదేవి ఆలయం, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వెంకటేశ్వరస్వామి గుడి, గంగమ్మ గుడి, పెద బజారు శివాలయం, సాయిమందిరం, స్వర్ణ శివాలయం, వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా అలంకరించారు. తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో గల రాజ్యలక్ష్మీ పద్మవతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావూరిపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

అద్దంకి రూరల్: అద్దంకిలోని ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రం, కన్యకాపరమేశ్వరీ, వెయ్యిస్తంభాల దేవాలయాల్లో అమ్మవార్లను దుర్గాదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చీరాల అర్బన్: పట్టణంలోని పలు దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చీరాల అమరావారివీధిలోని లక్ష్మీభవన సమాజంలో శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు.



జాగర్లమూడిలో దుర్గాదేవి అలంకరణలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారు



కొణిదెనలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



అద్దంకి దత్తపాదుకా క్షేత్రంలో దుర్గాదేవిగా అమ్మవారు



వేటపాలెంలో దుర్గాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

పాస్టర్ల సహకారం మరువలేనిది



దేవుని వాక్య సందేశం ఇస్తున్న గిడియన్స్ ఇంటర్నేషనల్ స్టేట్ సెక్రటరీ ఏవీ రావు

చీరాల రూరల్: గిడియన్స్ ఇంటర్నేషనల్ పరిచర్యలో పాస్టర్లు అందిస్తున్న సహకారం మరువలేనిదని గిడియన్స్ ఇంటర్నేషనల్ స్టేట్ సెక్రటరీ డాక్టర్ ఏవీరావు అన్నారు. గిడియన్స్ ఇంటర్నేషనల్ చీరాల క్యాంప్ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేట ఐఎల్‌టీడీ కాలనీలోని సెయింట్ మాథ్యూస్ లూథరన్ చర్చిలో యాన్యువల్ పాస్టర్స్ ఈమెంట్ కార్యక్రమాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చీరాల క్యాంప్ ప్రెసిడెంట్ యంద్రపాటి జాన్సన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గిడియన్స్ స్టేట్ సెక్రటరీ డాక్టర్ ఏవీ రావు, గిడియన్స్ స్టేట్ మహిళా ప్రెసిడెంట్ సునీతా మనోహర్, స్టేట్ మహిళా చాప్లిన్ డాక్టర్ ఎస్. సంధ్యారాణి దేవుని వాక్య సందేశాలు అందించారు. గిడియన్స్ ఇంటర్నేషనల్ పరిచర్య 1898లో అమెరికాలో ప్రారంభించారని అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరాటంకంగా తన సేవలను కొనసాగిస్తుందని చెప్పారు. గిడియన్స్ ఇంటర్నేషనల్ పరిచర్య మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా 199 దేశాల్లో బైబిల్ పరిచర్య విస్తరించిందని చెప్పారు. గిడియన్స్ ఏరియా డైరెక్టర్ యాజల ప్రకాష్, ఫార్మర్ ఎస్‌పీసీ వేముల ఐజాక్సన్, డాక్టర్ ఇస్తర్ల బాబురావు, మహిళా ప్రతినిధి కేఈ మనోరంజని, గిడియన్స్ చీరాల క్యాంప్ వైస్ ప్రెసిడెంట్ విస్తర్ల జయకుమార్, మహిళా వైస్ ప్రెసిడెంట్ ఆర్. సునీత కిషోర్, అధిక సంఖ్యలో పాస్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన గేదె

బల్లికురవ: విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతి చెందిన ఘటన కూకట్లపల్లిలో సోమవారం మధ్యాహ్నం జరగ్గా, మంగళవారం వెలుగు చూసింది. కూకట్లపల్లి గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి వీరారెడ్డి గ్రామం నుంచి బొగ్గుల కొండ పొలాలకు మూడు పాడి గేదెలను తోలువెళుతున్నాడు. ఈ క్రమంలో పొలాల వద్ద రోడ్డు మార్జిన్‌లో కింద పడి ఉన్న విద్యుత్ తీగను తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై ఒక పశువు మృతి చెందింది. మృతిచెందిన పశువును రెండు రోజుల క్రితం రూ.1.20లక్షలకు అడిగారని పాడికోసం అమ్ముకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే గేదె ఈడంతో పాడి కోసం ఉంచుకున్నామని తెలిపారు. ఇప్పుడు దూడను ఎలా బతికించుకోవాలో తెలియడంలేదన్నారు. స్థానిక పశువైద్యాధికారి శిరీష వచ్చి ధ్రువీకరణ పత్రం అందజేశారని చెప్పారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

మేదరమెట్ల: ఈగల్ సెల్ ఆధ్వర్యంలో కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో డ్రగ్స్‌పై అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. కొరిశపాడు ఎస్సై సురేష్‌బాబు మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన పిల్లలు మానసికంగా ఎలా ఉంటారో వారిప్రవర్తన ఎలా ఉంటుందో తల్లిదండ్రులకు వివరించారు. ఈగల్‌సెల్ సెంటర్ ఫోన్ 1972 గురించి వివరించారు. ఏఎస్సై సుబ్బారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.